# ముగ్గురు మిత్రులు

ట్రామ్‌లైన్ పక్కనే ఉంది వాళ్ళగది. ట్రామ్ నడిచినప్పుడల్లా వాళ్ళున్న మేడ దడదడ అదురుతుంది. అయినా వాళ్ళు ముగ్గురూ ట్రామ్ చప్పుడు సంగతి మరచిపోయారు. అసలు ఆ చప్పుడు లేకపోతే వాళ్ళకు తోచదు.

రాజు కవి. ప్రస్తుతం ఒక బ్యాంకిలో గుమస్తా. జీతం సరిపోదనే కారణంచేత భార్యను పుట్టింట వుంచి నాతిగల బ్రహ్మచర్యాన్ని నడుపుతున్నాడు. కాంతారావు గాయకుడు. ప్రకాశం చిత్రకారుడు. ఇద్దరూ బ్రహ్మచారులు. మామూలుగా గుమస్తా ఉద్యోగాల్లో పడితే తమశక్తి సామర్థ్యాలు సన్నగిల్లిపోతాయని పట్నంలో కళారాధన చేసి పలుకుబడి బంగారము కూడబెడదామనే ఆశయంతో చదువు పూర్తి కాగానే పట్నం చేరారు. ప్రకాశం సినిమా వాళ్ళకీ, పత్రికల వాళ్ళకీ, బొమ్మలు గీసి అప్పుడప్పుడు, కొద్దికొద్దిగా డబ్బు సంపాదిస్తుంటాడు. కాంతారావు ఇంకా ఆర్జన మొదలుపెట్టలేదు. అతను సినీమాలలో ఎట్లాగో అడుగుపెట్టి ఆ రంగంలో అఖండుడు కావాలని ప్రయత్నిస్తున్నాడు. అప్పుడప్పుడు రేడియో నాటకాలలో పాల్గొనేటంతవరకు అతని ప్రయత్నాలు ఫలించాయి. ముగ్గురి ఆర్జనా మూడుచేత భాగించి కాలక్షేపం చేస్తున్నారు.

రాజు బ్యాంకునించి ట్రాముదిగి దడదడ మేడమెట్లు ఎక్కాడు. దబదబ తలుపు కొట్టాడు. అబ్బ సరిగా తను వచ్చేసరికి తలుపు వేసి వుంటుంది. మళ్ళీ తలుపు కొట్టాడు. ప్రకాశం ఏం చేస్తున్నాడు?

"ఉండరా, కాస్త గుడ్డన్ని కట్టెయ్యి."

"తియ్యరా తలుపు. ఎంతసేపని?"

ప్రకాశం తలుపు తెరిచాడు. స్నానంచేసి తడితువ్వాలు చుట్టపెట్టుకున్నాడు.

"నీళ్ళ గదిలో ఉన్నానురా. అంత తొందర పడితే ఎట్లాగరా!"

రాజు నీరసంగా పరుపుచుట్టమీద వీపు వాల్చి నిట్టూర్చాడు.

"ఏమిట్రా! గదంతా ఇల్లావుంది? ఈవేళ దాసీ రాలేదా?"

"వొచ్చింది. కాంత ఎవళ్ళనో తీసుకొచ్చాడు. వాళ్ళంతా తలొక పది సిగరెట్లు కాల్చి ఆ తాలూకు బూడిద, పీకలు పదిలంగా గదిలో పారేశారు."

"సినీమా వాళ్ళా?"

"మరే"

"ఆ బొమ్మకి నమూనాలు గీశావా?"

"రంగులయిపోయాయిరా. డబ్బు లేదు. పన్నెండయాయి. ముప్పయి నమూనాలు గియ్యాలి."

"మంచిపనే. రేపు డబ్బివ్వకపోతే కిందున్న పేదరాశి పెద్దమ్మ మన్ని వెళ్ళగొడుతుంది."

